# స్విమ్మింగ్‌పూల్‌లో పడి విద్యార్థి మృతి

**మొయినాబాద్, జూన్ 29 ప్రభాతవార్త:**
ఇబ్రహీంపట్నంలోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులు కొంత మందితో కలిసి గెట్‌టుగెదర్ పార్టీ చేసుకునేందుకు మొయినాబాద్‌లోని ఒక ఫామ్ హౌస్‌కి వచ్చి పార్టీ చేసుకుంటుండగా రాత్రి 12 గంటలకు కరెంటు పోయిన సమయంలో చిట్టి ఆనంద్ (21) ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయాడు. ఆ తర్వాత స్పృహ లేకుండా పోయాడు. ఆ వెంటనే తోటి మిత్రులు గమనించి లంగర్‌హౌస్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని ధృవీకరించారని తోటి విద్యార్థులు తెలిపారు. ఈ విషయాన్ని తోటి విద్యార్థులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు తక్షణమే అక్కడకు చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా హాస్పిటల్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. మృతి తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు అందాల్సి ఉంది. మృతుడు చిట్టి ఆనంద్ నివాసం సరూర్‌నగర్ మండలంలోని బాలాపూర్‌గా తెలిసింది.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# నేడే పోడు పట్టాల పంపిణీ : జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
జిల్లాలో 436 మంది లబ్ధిదారులకు పోడు పట్టాలను అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహణపై డిఆర్ఓ అశోక్ కుమార్, ఆర్డిఓ విజయ కుమారి, డిటిడబ్ల్యూ కోటాజి, తహసీల్దార్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని 10 మండలాల నుండి ఎంపిక చేసిన 436 మంది లబ్ధిదారులకు శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా పోడు పట్టాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పోడు పట్టాలతో పాటు రైతుబంధును కూడా ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. లబ్ధిదారులు సకాలంలో కలెక్టరేట్లోని సమావేశ మందిరానికి వచ్చే విధంగా సంబంధిత మండలాల తహసీల్దారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పోడు పట్టాలు రానివారు నిరాశ చెందకుండా వివిధ దశల్లో ప్రక్రియ కొనసాగుతుందని తెలియజేయాలని తహసీల్దార్లకు కలెక్టర్ సూచించారు.

## శ్రీవారి ఆలయంలో అషాడ శుద్ద ఏకాదశి పూజలు



ఆలయంలో శ్రీవిష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

**కొడంగల్, జూన్ 29 ప్రభాతవార్త**
పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆషాడ శుద్ధ్య ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో మొదలుకొని స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి కావడంతో ఉదయం వేళల్లో దేవాలయంలోని అభిషేక మండపంలో శ్రీ విష్ణుమూర్తి చిత్రపటానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్బంగా ఉపావాస దీక్షలతో ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అధ్యాత్మిక సేవా సమితి సభ్యులు, భక్తులు శ్రీ విష్ణు సహస్ర పారాయణం చేశారు. అరనంతరం భక్తులకు తీర్ద ప్రసాదాలను అందించారు. ఆలయ ప్రాంగణం భక్తుల కొలాహలంతో గోవింద నామస్మరణలతో మారుమ్రోగింది.

## భక్తి, శ్రద్ధలతో తొలిఏకాదశి వేడుకలు

**-ఆలయాల్లో భక్తుల సందడి**



ఘట్‌కేసర్ శివారెడ్డిగూడలో సాముహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న దంపతులు

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలంలో గురువారం తొలిఏకాదశి పండుగను భక్తి, శ్రద్దలతో జరుపుకున్నారు. ఉదయమే ప్రజలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కొందరు భక్తి, శ్రద్దలతో ఉపవాసదీక్షలు చేసి వ్రతాలు నిర్వహించారు. ఏడాది పొడవునా ఉండే 24 ఏకాదశుల్లో ఆషాడ శుక్ల ఏకాదశిని తొలి ఏకాదశిగా, విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలిఏకాదశి (శయన ఏకాదశి)గా పరిగణిస్తారు. ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ, కొండాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్, ఎదులాబాద్, వెంకటాపూర్, చౌదరిగూడ, ఘణాపూర్ తదితర గ్రామాల్లో తొలిఏకాదశి పర్వదినాన్ని భక్తితో నిర్వహించారు. శివారెడ్డిగూడ శ్రీదండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయ-మల్లికార్జునస్వామి దేవాలయంలో పలువురు దంపతులు సాముహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తి, శ్రద్దలతో నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఘట్‌కేసర్ వేమనానగర్ శ్రీవిజయవెంకటేశ్వరస్వామి, బాలాజీనగర్ గీతామందిర్ శ్రీవెంకటేశ్వరస్వామి, ఎన్ఎఫ్‌సీనగర్ శ్రీకళ్యాణకోదండరామచంద్రస్వామి, చౌదరిగూడ వెంకటాద్రిటౌన్‌షిప్ శ్రీకోదండరామచంద్రస్వామి, ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత రంగమన్నార్‌నాయకస్వామి, వెంకటాపూర్ శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో పూలు, పళ్లు, కొబ్బరికాయలు, పూజాసామాగ్రి విక్రయాలు అధికంగా జరిగాయి.

## బిటి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**-ఎస్‌డిఎఫ్ నిధులు రూ.1 కోటి 95 లక్షలు మంజూరు**

**-ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు**



శ్రీనివాస్‌లు గూడెంలో బిటి రోడ్డు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

**నందిగామ జూన్29, ప్రభాతవార్త :**
ఎన్నో ఎళ్ల నుండి ఎదురు చూసిన రోడ్డుకు మోక్షం లభించడంతో శ్రీనివాసులు గూడ, మజిద్ మామిడిపల్లి, ఈదులపల్లి గ్రామస్థులు హార్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామిని నిలబెట్టుకోవడంతో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు ప్రత్యేకంగా గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. నందిగామ మండలం శ్రీనివాసులు గూడ గ్రామంలో గురువారం సర్పంచ్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌డిఎఫ్ నిధులు రూ.1 కోటి 95 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బిటి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తోలి ఎకాదశి, బక్రీదు పర్వదినం రోజున మూడు గ్రామాల ప్రజల, రైతుల సమక్షంలో అట్టహాసంగా జరిగింది. అంతకు ముందు శ్రీనివాసులు గూడకు విచ్చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మజిద్‌మామిడి వయా శ్రీనివాసులు గూడ మీదుగా ఈదులపల్లి వరకు నిర్మించే ఈ రోడ్డుతో మూడు గ్రామాల రైతులకు, బాట సారులకు వాహనదారులకు ఎంతో మేలు చేకూరుతుంది, ఈ కార్యక్రమంలో జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్, చేగూరు సింగిల్ విండో చైర్మన్ జి.అశోక్ మాజీ చైర్మన్ ఎం.విఠల్ , జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జిల్లెల వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ పూలమల్లేష్, రాజీరెడ్డి, కుమ్మరి కృష్ణ, రవిందర్ రెడ్డి, మహేందర్, జన్ముల జంగయ్య, పూల లక్ష్మయ్య, కుమ్మరి రాంచెంద్రి, పూల రవి, గడ్డం శ్రీనివాస్, ప్రముఖ, సామాజికవేత్త తాండ్ర గోపాల్ రెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కారం

**(వార్తకు స్పందన)**

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 29,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని నంద్యతాండాలో విద్యుత్ వైర్లు కిందజారి పడి ప్రమాదకరంగ తయారైన వైనంపై వార్త దినపత్రికలో గురువారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్ అధికారులు నంద్యాతాండాలో గల విద్యుత్ సమస్యను పరిష్కరించారు. విద్యుత్ వైర్లు కిందకు జారిపడిన వద్ద నూతన స్థంబాలు అమర్చారు. దీంతో తాండాలో విద్యుత్ సమస్య తొలగిపోయిందని తాండా వాసులు అంటున్నారు. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్



సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే.



బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లిం నాయకులు

**తాండూరు, జూన్ 29, ప్రభాతవార్త :**
త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పర్వదినాన్ని తాండూరులో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. గురువారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ శివారు చెనిగెష్‌పూర్ రోడ్డు మార్గంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.. ఈద్గాకమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు జరిగాయి. సామూహిక ప్రార్థనల్లో వేలమంది ముస్లింలు పాలుపంచుకున్నారు. దాదాపు గంటపాటు ఈద్గా మైదానంలో ఈ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్, టిపిసిసి ఉపాధ్యక్షులు రమేష్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ రాజుగౌడ్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అప్పు(నయ్యూం), మాజీ డిపిసి సభ్యులు పట్లోళ్ల నర్సింలు, నాయకులు శ్రీనివాస్‌చారి, పట్లోళ్ల నర్సింలు, బాల్‌రెడ్డి, రవిగౌడ్, మసూద్, మాజీ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ రావూఫ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, వివిద పార్టీల నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గోని ముస్లింలకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. అందరికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తాండూరులో గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి పండుగను హిందూ, ముస్లింలు సోదర భావంతో కలిసి మెలిసి జరుపుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. అనంతరం ఈద్గాకమిటి ఇచ్చిన తేనీటివిందులో నేతలంతా పాల్గోన్నారు. మరోవైపు ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలను దృష్టిలో ఉంచుకోని పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. డిఎస్పీ శేఖర్‌గౌడ్ నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అదేవిదంగా మున్సిపల్ అధికారులు కూడ భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వివిద పార్టీల నేతలు, ఈద్గా కమిటి ప్రతినిధులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గోన్నారు.

**కడ్తాల్ మండలంలో...**

**కడ్తాల్, జూన్ 29 ప్రభాతవార్త :** కడ్తాల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మాధారం, న్యమంతపూర్, రావిచేడ్, సాలార్‌పూర్, ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ, కర్కల్‌పహాడ్ గ్రామాలలో ముస్లిం సోదరులు గురువారం బక్రీద్ పండగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో స్థానిక ఈద్గా వద్ద ఇమామ్ జహీరుద్దిన్ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్ చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. బక్రీద్ వేడుకల కోసం ఈద్గా వద్ద మసీద్ కమిటి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, మాజీ జడ్పీటిసి శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ, మండల అధ్యక్షుడు బిచ్యనాయక్ తదితరులు ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మసీద్ కమిటి అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్, మార్కెట్ కమిటి డైరెక్టర్ లాయక్ అలీ, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, జహంగీర్ అలీ, ఇర్షద్, వహాబ్, గౌస్, అనీస్, ఇద్రిస్ పాల్గొన్నారు.

## గ్రూప్ -4 పరీక్షకు భారీ బందోబస్తు

**-జిల్లా ఎస్పీ కోటిరెడ్డి**

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
గ్రూప్ -4 పరీక్ష కొరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో శనివారం రోజున జరగబోయే గ్రూప్ -4 పరీక్షల కొరకు కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఎస్పీ మాట్లాడుతూ...పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయడం జరుగుతందని కావున పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జనాలు గుమిగూడకుండా ఉండాలని, పరీక్షా కేంద్రాలకు దగ్గరలో ఉండే జిరాక్స్ షాపులు, ఇతరత్రా వాటిని ముందుగానే మూసి వేయాలని, పరీక్ష కేంద్రాలలోకి అభ్యర్థులు, కేటాయించబడిన అధికారులు, సిబ్బంది తప్ప ఇతరులను అనుమతి ఉండదు అని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో 67 పరీక్ష కేంద్రాలలో 18118 మంది అభ్యర్థులకు శనివారం గ్రూప్ -4 పరీక్ష నిర్వహించడం జరుగుతంది. ఇట్టి పరీక్షలకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా పోలీస్ అధికారులు సిబ్బంది మొత్తం కలపి దాదాపుగా 190 మందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. గ్రూప్ -4 పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. అభ్యర్థులకు ఏమైనా అవసరం ఉన్న పోలీస్ అధికారులకు లేదా డైల్ 100కు గాని సంప్రదించవచ్చు అని ఇట్టి బందోబస్తులో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి తమకు ఇచ్చిన ఏరియాలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా గ్రూప్ -4 పరీక్షల బందోబస్తులో పాల్గొని, విజయవంతం చేయాలని ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లు అయితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలని బందోబసన్త విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గ్రూప్ -4 పరీక్ష నియమానిబంధనలు పాటించాలని ప్రతి ఒక్కరు సమయపాలన పాటించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షకు హాజరు అయ్యి తమ కలలను సాకారం చేసుకోవాలని గ్రూప్-4 పరీక్ష రాసే ప్రతి ఒక్కరికి బెస్ట్ ఆఫ్ లక్ అని తెలిపారు.

# మూగబోయిన ఉద్యమ గానం




**సాయిచంద్ మరణంతో కన్నీటి పర్వతమైన భార్య, కుటుంభ సభ్యులు**

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి హైదరాబాద్ జూన్ 29 (ప్రభాతవార్త)**
తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గాయకుడు రాష్ట్ర గిడ్డంగుల శాఖ ఛైర్మన్ సాయిచంద్ గుండెపోటుతో మరణించడంతో తెలంగాణ ప్రజలు అభిమానులు ఒక సారిగా ఉలికి పడ్డారు. ఈ సంఘటన బుదవారం రాత్రి జరిగిన మరణ వార్త మాత్రం గురువారం తెల్లవారు జామునుంచి అన్ని ప్రాంతాల ప్రజలకు తెలియడంతో ఉదయం నుంచే బిఆర్ఎస్ శ్రేణులు, పార్టీ అభిమానులు కళాకారులు కవులు, మేదావులు, రచయితలు, గాయకులు ఆయన భౌతిక గాయాన్ని కడసారి చూడడానికి భారీగా తరలివచ్చారు. బుదవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమరిచింత తన స్వాగ్రామానికి వెళ్లారు. తన బందు మిత్రులతో కల్సిన సాయిచంద్ అనంతరం ఫాం హౌజ్‌కు వెళ్లారు. అక్కడే ఆయనకు గుండె పోటు రావడంతో హుటా హూటిగా చికిత్స కోసం నాగర్‌కర్నూల్ తరలించగా ఆయన అప్పటికే మరణించినట్లు డాక్టర్లు ప్రకటించినప్పటికి ఆయన భార్య బందువులు నగరంలోని కేర్ ఆసుపత్రికి తరలించారు. కేర్ ఆసుపత్రిలో డాక్టర్లు సాయిచంద్ మృత్తి చెందినట్లు చెప్పడంతో అనంతరం ఆయన మరణ వార్త గురువారం తెల్లవారు జాము నుంచి సోషల్ మీడీయా, ఎలక్ట్రాన్ మీడియాలో ప్రసారం కావడంతో తెలంగాణ వాప్తంగా తెల్సిపోవడంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మంత్రులు రాజకీయ నాయకులు, మేదావులు అభిమానులు పెద్ద సంఖ్యంలో ఆయన భౌతిక గాయాన్ని చూడడానికి తరలివచ్చారు. కేర్ ఆసుపత్రి, అనంతరం రంగారెడ్డి జిల్లా ఎల్‌బినగర్ గుర్రంగూడలోని ఆయన నివాసానికి భౌతిక గాయాన్ని ప్రజల దర్శనార్థం తరలించారు. ఆయన స్వంత గ్రామం నాగర్‌కర్నూల్ అయినప్పటికి కుటుంభ సభ్యుల కోరిక మెరకు ఆయన అంతిమ సంస్కారాలు గుర్రంగూడ, సాహెబ్‌నగర్‌లోని స్మషాన వాటికలో నిర్వహించారు. తెలంగాణ ఉద్యమం అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాతా బిఆర్ఎస్ పార్టీలో చురుకైన నాయకునిగా, గాయకునిగా అనునిత్యం ప్రజల మధ్యన తన జీవితాన్ని కొనసాగిస్తున్న సాయిచంద్ అకాల మరణంతో విప్లవకారులు కవులు కళకారులు మేదావులు ఒక సారిగా ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక పోయ్యారు. గుర్రంగూడ పరిసర ప్రాంతాలన్ని సాయిచంద్ అభిమానులతో కిటకిటలాడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌తోపాటు రాష్ట్రంలోని పలు శాఖల మంత్రులు హరీష్‌రావు, సబితాఇంద్రారెడ్డి, కెటిఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, సుదీర్‌రెడ్డి, రాష్ట్ర నలుమూలలనుంచి రాజకీయాలకు అతీతంగా పెద్దమొత్తంలో తరలివచ్చి కడసారి ఆయనకు నివాళులు అర్పించారు. గాయకుడు గద్దర్‌తోపాటు గాయకురాలు మంగ్లీ, మదుప్రియ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొని అంతిమ యాత్రలో పాల్గోన్నారు.

సాయిచంద్ మరణంతో ఆయన భార్య రజిని కన్నీటి పర్వతమైయ్యారు. సాయిచంద్ ఇక లేరన్న విషయాన్ని తలచుకుంటు ఆమే ఏడ్పును ఎవ్వరు ఆపలేక పోయ్యారు. ఆయన భౌతిక గాయాన్ని చుడడానికి వచ్చిన వేలాదిమంది. భార్య రజిని ధుఖ్కాని చూసిన వారంత కన్నీటి పర్వతమయ్యారు. గాయకుడు సాయిచంద్ తండ్రి కూడా బుదవారం చివరిసారిగా తనను కల్సి పలు విషాయాలు చెప్పి తనకు కొడంతధైర్యమిచ్చిన కుమారురిని పలు సార్లు తలుచుకుంటు హటా తు మరణాన్ని జీర్ణించుకోలేక పోయ్యారు. ఆయన పదే పదేగా తన కుమారుని తలచుకోవడం ఏడ్వ డంతో కుటుంభ సభ్యులంతా ఒక సారిగా కన్నీటి పర్వతమయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ సాయి చంద్ నివాసానికి చేరుకోని ఆయన కుటుంబ సభ్యులను భార్యపిల్లలును ఓదార్చి ప్రగాడ సంతాపాన్ని తెలిపారు. సాయిచంద్ తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను ఎప్పటికి మరువలేమని ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర మంత్రులు గుర్తుచేశారు.

# శంకుస్థాపన చేశారు..నిర్మాణ పనులు మరిచారు

**- శంకుస్థాపనలు జరిగి ఏడాది దాటినా నిర్మాణ పనులకు నోచుకోని వైనం**
**-మంత్రి మల్లారెడ్డి శిలాఫలకం వేశారు... మరి నిర్మాణ పనులు చేపట్టేదెన్నడు..?**



తూంకుంటలో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, పనులు షురూ కాక శిలాఫలకం విడ్డూరంగ మారిన దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త**
తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో ఇంటి గ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపట్టటానికి శంకుస్థాపన చేసి ఏడాది దాటినా ఇంత వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకపోవటంలో జాప్యానికి అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాదిలో శిలాఫలకం వేశారు..ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదు..ఎందుకు జాప్యం చేస్తున్నారని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో తూంకుంటలోనే శ్రీగాయిత్రీ మహాక్షేత్రంకు వెళ్లే దారి పక్కనే ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించటానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి 5మే2022న (గత ఏడాదిలో) విచ్చేసి దాన్ని నిర్మించటానికి శంకుస్థాపన చేయటం జరిగింది. ఏడాది దాటినా ఇంత వరకు నిర్మాణ పనులకు నోచుకోవటం లేదని, శిలాఫలకం వెక్కిరిస్తున్నట్లు పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. సుమారు 2 కోట్ల రూపాయలతో మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించటానికి నిధులు మంజూరు జరిగి శంకుస్థాపన చేశారు. అయితే రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, తూంకుంట మున్సిపాల్టీ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావులు విచ్చేసి శంకుస్థాపన చేశారని ఇంత వరకు నిర్మాణ పనులు చేపట్టటం లేదని పలువురు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పురపాలక శాఖ ఆధ్వర్యంలో మున్సిపాల్టీలలో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్‌ల నిర్మించటానికి శ్రీకారం చుట్టటం జరిగింది. మున్సిపాల్టీలోని అన్ని వార్డుల ప్రజలకు మున్సిపాల్టీ (వార్డుల, గ్రామాల వారికి) ద్వారా మార్కెట్ కాంప్లెక్స్ అందుబాటులో ఉండటానికి నిర్మించటానికి నిర్ణయించినప్పటికీ శిలాఫలకం వేసినప్పటికీ పనులు చేపట్టటానికి ఎందుకు నిర్లక్ష్యం జరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిర్మించే విషయంలో ఎందుకు జాప్యం జరుగుతుందనే విషయం మాత్రం తెలియకుండ ఉందని పలువురు వాపోతున్నారు. మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించటానికి కాంట్రాక్టర్ వచ్చి పనులు చేపట్టటానికి గతంలో వచ్చి తిరిగి వెళ్లి మళ్లీ రాలేదని పలువురు వాపోతున్నారు. తూంకుంట మున్సిపాల్టీ ప్రజలకు వివిధ వార్డుల వారికి కూరగాయల మార్కెట్ అంటూ లేకపోవటంతో వార్డులలో గ్రామాల్లో గల్లీల్లో వారంతపు సంతలు నిర్వహిస్తున్నారు. దీంతో కాలనీల్లో సంతలు నిర్వహించటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కిక్కిరి ఉంటుండటంతో ప్రజలు, అమ్మకం దార్లు కూడ ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు వెజ్, అదే విధంగ నాన్‌వెజ్ కూడ ఒకే చోట ప్రజలు కొనుగోలు చేయటానికి మార్కెట్ కాంప్లెక్స్‌లు నిర్మించటానికి శంకుస్థాపన చేసినా సకాలంలో వాటి నిర్మాణం పనులు జరగక మున్సిపాల్టీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు, కమిషనర్ జైతురామ్ నాయక్, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే జాప్యం జరగకుండ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టెలా చర్యలు తీసుకోవాలని మున్సిపాల్టీకి చెందిన పలువురు ప్రజలు కోరుతున్నారు.

## సాయిచంద్‌కు ఘన నివాళి



మేడ్చల్‌లో ఉద్యమకారుడు సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

**మేడ్చల్, జూన్ 29. ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమ కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మృతికి మేడ్చల్‌లో నేతలు శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అతని చిత్రపటానికి పూలమాలలు వేసి ఈ సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ జడ్పిటిసి శైలజ హరినాథ్, బిజేపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, ఆయా పార్టీల నాయకులు దయానంద్ యాదవ్, శేఖర్‌గౌడ్, విష్ణుచారీ, రాజమల్లారెడ్డి, నర్సింహరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నాగరాజు, సత్యనారాయణ, మహేష్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

### జూలై 3న రంగనాథస్వామి ఆలయ టెండర్ల బహిరంగ వేలం

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** జూలై 3న శ్రీరంగనాథస్వామి దేవస్థానంలో టెంకాయ, పూజాసామాగ్రీ సరఫరా హక్కులకు బహిరంగ వేలం వేయనున్నట్లు దేవస్థానం కార్య నిర్వహణాధికారిణి ఎల్.భాగ్యలక్ష్మి ఘట్‌కేసర్‌లో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోచారం మున్సిపల్ యంనంపేట్‌లోని దేవస్థానం ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటలకు దేవాదాయ-ధర్మాదాయ శాఖ నియమ నిబంధనలను అనుసరించి నిర్వహించే వేలంలో ఆసక్తి కల్గిన వారు పాల్గొనాలని కోరారు. కొబ్బరికాయలు, పూజాసామాగ్రీ టెండర్ కాలపరిమితి 1 ఆగస్టు 2023 నుంచి 31 జూలై 2024 వరకు ఉంటుందని దీనికి రూ.10,000లు ధరావత్తు చెల్లించాలని తెలిపారు. దేవాలయ ఉద్యోగులు, ఆలయానికి బకాయిపడిన వారు వేలంలో పాల్గొనుటకు అనర్హులని, వేలంలో పాల్గొనే వారు ముందుగా దేవస్థానంలో ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ధరావత్తు చెల్లించని వ్యక్తి వేలంలో ప్రత్యేక్షంగా గాని పరోక్షంగా గాని పాల్గొనే అవకాశం ఉండదని, హెచ్చుపాటదారుని వేలం పాట దేవాదాయశాఖ ఆమోదం మేరకు ఉంటుందన్నారు. వేలం పాట అయిన వెంటనే హెచ్చుపాటదారుడు వేలం సొమ్ము సగం వెంటనే చెల్లించాలని మిగతా సొమ్ము 15 రోజులలోపు చెల్లించాలని పేర్కొన్నారు. దేవస్థానం నిర్దేశించిన స్థలంలోనే సదరు దుకాణం నిర్వహించాలని, ఏడాది కాలపరిమితి ముగిసిన తర్వాత దుకాణాలను ఖాళీ చేసి దేవస్థానంకు అప్పగించాలని పేర్కొన్నారు. సమయానుకూలంగా షరతులు మార్చుటకు, ఎలాంటి కారణం చూపకుండానే వేలం పాటను నిలుపుదల, వాయిదా వేయడానికి దేవస్థానంకు సంపూర్ణ అధికారం ఉందని ఈఓ స్పష్టం చేశారు.

## యువత వ్యాపార రంగాల్లో రాణించాలి

**-బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్**



**శంషాబాద్ జూన్29,ప్రభాతవార్త :** విద్యావంతులైన యువతి యువకులు తమ శక్తి సామర్థ్యాల మేరు వ్యాపార రంగాల్లో రాణించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ సూచించారు. బిజెపి జిల్లా నాయకుడు గుర్రంపల్లి లక్ష్మయ్య పెద్ద షాపూర్ గ్రామంలో హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన టి పార్కును గురువారం ఆయన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. యువతి యువకులు స్వయం ఉపాధి పథకాలను ఎంచుకొని ముందుకు సాగడం ఎంతో అభినందనీయమని సూచించారు. విద్యావంతులు యువకులు తమకు అనుభవం ఉన్న ఆసక్తి ఉన్న రంగాలలో అడుగుపెట్టి ముందడుగు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్, బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదవ్, శంషాబాద్ మండల బిజెవైఎం అధ్యక్షుడు ఎంపిటిసి బొక్క ప్రవీణ్ కుమార్, పార్టీ నాయకులు పుంజాల సంతోష్ గౌడ్, మోహన్ రావు, బండే కుమార్ యాదవ్, వినోద్ కుమార్, బాతుకు శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నల్లా బిల్లులను తగ్గించాలని వినతి



తూంకుంటలో వాటర్ సప్లయి మేనేజర్‌కు నల్లా బిల్లులు బకాయిలు రద్దు చేసి, నల్లా బిల్లులు తగ్గించాలని వినతిపత్రాన్ని అందజేసిన కౌన్సిలర్ పి.నర్సింగ్‌రావుగౌడ్

**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త** తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో త్రాగునీరు నల్లా బిల్లులు పాతవి రద్దు చేయాలని, నల్లా బిల్లులు ఇక నుంచి తగ్గించాలని, గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ మాదిరిగా తూంకుంట మున్సిపాల్టీలోనూ నల్లా బిల్లులు తగ్గించాలని 11వ వార్డు కౌన్సిలర్ పి.నర్సింగ్‌రావుగౌడ్ సంబంధిత మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. శామీర్‌పేట మండలంలోని తూంకుంట మున్సిపాల్టీ ప్రజలకు నల్లా బిల్లులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మే 6వ తేదీన గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ సమావేశంలో పాలకవర్గం సూచించిన మేరకు మున్సిపాల్టీలో చెల్లించాల్సిన నీటి బిల్లులు బకాయిలు రద్దు చేశారని, నల్లా బిల్లును నెలకు వంద రూపాయలు మాత్రమే చెల్లించేలా నిర్ణయం తీసుకుని హెచ్‌ఎండబ్ల్యుఎస్ వారు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో ప్రకటించినట్లు కౌన్సిలర్ నర్సింగ్‌రావుగౌడ్ తెలిపారు. పాతబిల్లులు రద్దు చేయాలని, నెలకు వంద రూపాయలు మాత్రమే తీసుకోవాలని, బిల్లులు చెల్లించకుంటే ఎటువంటి సమాచారం లేకుండా నీటి కనెక్షన్ తొలగించరాదని, ముందుగా యజమానికి నోటీసులు ఇవ్వాలని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు కూడ స్పందించి నల్లా పాత బాకాయి బిల్లులను రద్దు చేసి, కొత్తగా నల్లా బిల్లులను వంద రూపాయల తరహాలోనే తీసుకోవాలని ఆయన సూచించారు. తూంకుంట మున్సిపాల్టీ వచ్చె నెలలో జరిగే పాలకవర్గం సమావేశంలో ఈ విషయం ప్రస్తావించనున్నట్లు కౌన్సిలర్ నర్సింగ్‌రావుగౌడ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు కూడ పేర్కొన్నారు.

### రోగులకు మెరుగైన సేవలు అందించాలి

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** రోగులకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందించాలని చౌదరిగూడ సర్పంచ్ బైరు రమాదేవి అన్నారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ సాయినగర్‌కు చెందిన డాక్టర్ వెంకటేశ్ గురువారం ఆదర్శ్ క్లినిక్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ రమాదేవి ముఖ్యఅతిధిగా విచ్చేసి రిబ్బన్ కత్తిరించి క్లినిక్‌ను ప్రారంభించారు. పేద ప్రజలకు అందుబాటులో వైద్యచికిత్స, మందులు అందించాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్, తేజ, పీఎంసీ కార్పొరేటర్ కొడె పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరుల దృశ్య



ఈద్గా వద్ద ప్రార్థనలకు ర్యాలీగా వెళుతున్న ముస్లిం సోదరుల దృశ్యం



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న దృశ్యం



మనూర్‌లో ఈద్ ముబారక్ తెలుపుకుంటున్న యువకులు

# ఘనంగా బక్రీద్ వేడుకలు

### ఈద్గాలో సామూహిక ప్రార్థనలు

**కొల్చారం, జూన్ 29, ప్రభాతవార్త:** త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం అని కొల్చారం మజీద్ ఇమామ్ మహమ్మద్ ఈపాక్, మత పెద్దలు సాదక్ అలీ, ఖదీర్‌లు అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల శివారులోని ఈద్గా వద్ద సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు. పండగను పురస్కరించుకునొ ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు మదన్‌రెడ్డి, మహిళా కమీషన్ చైర్మన్ సునితా లక్ష్మారెడ్డిలు ముస్లిం ప్రముఖులకు చరవాణి ద్వార బక్రీద్ ముబారక్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సమీర్, సైకిల్ బాబా, సొహెల్, సయ్యద్, అక్రమ్, షరీఫ్, వార్డు సభ్యులు మహమ్మద్, మున్వర్ అలీ, మున్ను, ఆయుబ్, ఖలీం, అర్షద్, మోజాన్, షరీఫ్, సాజిద్, ఖరీమ్, నజీర్, మసూద్, హైమద్, రహీం తదితరులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్ మండలంలో..**

**న్యాల్‌కల్, జూన్ 29, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి సామూహికంగా గ్రామ శివారులోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ఒకరికి ఒకరు కలుసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

**మనూర్‌లో..**

**మనూర్, జూన్ 29, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం కొత్త బట్టలు ధరించి గ్రామాల శివారులోని ఈద్గాల వద్దకు చేసుకుని సామూహికంగా ప్రార్థనలు చేసి ఒకరికి ఒకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల నుంచి వలస వెళ్లిన వారు తమ తమ స్వగ్రామాలకు చేరుకో వడంతో గ్రా మాల్లో సందడి కానవచ్చింది. పండగను పురస్కరించుకుని కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీ తంగా బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**నాగల్‌గిద్ద మండలంలో..**

**నాగల్‌గిద్ద, జూన్ 29, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి గ్రామ శివారులోని ఈద్గాల వద్దకు చేరుకుని సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ పండగ శుభాకాం క్షలు తెలుపుకున్నారు.

**ఝరాసంగంలో..**

**ఝరాసంగం, జూన్ 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురు వారం బక్రీద్ పండగను భక్తి శ్రద్ధలతో ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు సామూహికంగా ప్రార్థనలు నిర్వ హించారు. పండగను పురస్కరించుకుని ఒకిరికి ఒకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇమామ్‌లు పండగ ప్రాముఖ్యతపై వివరించారు.

# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



రామలింగేశ్వర ఆలయంలో సప్తహా భజనలు చేస్తున్న భక్తుల దృశ్యం



తంగడపల్లి మఠంలో ఏకబిల్వ మొక్కలు నాటుతున్న దృశ్యం

**న్యాల్‌కల్, జూన్ 29, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో ఆశాడ మాసాన్ని పురస్కరించుకుని సప్తహా భజనలకు గురువారం శ్రీకారం చుట్టారు. గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో ఆశాడ మాసంలో సప్తహా భజనలు నిర్వహించడం ఆనవాయతీగా వస్తోంది. గురువారం గ్రామస్థులు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి సప్తహా భజనలు (వారం రోజులు రౌండ్ ద క్లాక్‌గా) ప్రారంభించారు. గ్రామానికి చెందిన భక్తులు విడ తల వారిగా ఆలయంలో భజనలు చేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. వారం రోజుల పాటు భజనలు చేసి ముగింపు సందర్భంగా ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ (అన్నదానం) చేయనున్నట్లు సప్తహా భజన కమిటి నిర్వాహకులు పేర్కొన్నారు.

**న్యాల్‌కల్‌లో..**

**న్యాల్‌కల్, జూన్ 29, ప్రభాతవార్త:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండలంలోని రాంతీర్థం గ్రామంలోని రుక్మిణి మాత సమేత పాండురంగ స్వామి ఆలయం, రేజింతల్ గ్రామ శివారులోని శ్రీ సిద్ధివినాయక, రాఘవాపూర్ గ్రామ శివారులోని పంచవటి క్షేత్రంలోని అక్షర స్వరూపిణి శ్రీ సరస్వతి మాత, జ్యోతిర్లింగాలు, సాయిబాబ, శ్రీ వెంకటేశ్వర, గంగ మాత ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని రాంతీర్థం గ్రామంలోని రుక్మిణి మాత సమేత పాండురంగ స్వామి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేయగా గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం గ్రామస్థులు ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన పల్లకిలో ప్రతిష్టించుకుని గ్రామంలోని పురవీధుల గుండా భజనలు చేస్తూ ఊరేగిస్తారు. ఊరేగింపు ఆలయానికి చేరుకున్నాక పెరుగుబుడ్డిని పగలకొట్టి ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు (అన్నదానం) చేస్తామని ఉత్సవ కమిటి నిర్వాహకులు పేర్కొన్నారు.

**తంగడపల్లి మఠంలో ఏకబిల్వ మొక్కల పెంపకం**

**సాదాశివపేట, జూన్ 29, ప్రభాతవార్త:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని తంగడపల్లి గ్రామంలోని శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మఠం శ్రీ గురు గంగాధర మహాస్వామి ఆశ్రమంలో గురువారం ఏకబిల్ల మొక్కలను నాటారు. అంతకు ముందు ఆశ్రమంలో ఉదయం కోటి బిల్వ లింగేశ్వర స్వామికి వృద్ధాభిషేకం, మహా మంగళహారతి పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఆశ్రమ ప్రాంగణంలో నిత్య పూజ కైకర్యాలకు ఏకబిల్వము, త్రిబల్వము, ఆయా రకాలు రంగు రంగు పుష్పాల మొక్కలను శ్రీ షఠస్థల బ్రహ్మ శివయోగి శివాచార్య మహా స్వాములు మొక్కలను నాటారు. కార్యక్రమంలో వేద పాఠశాల నిర్వాహకులు మడపతి మహేష్ స్వామి, అర్చకులు విజయస్వామి, కేదార్నాథ్ స్వామి వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# సాయిచంద్‌కు ఘన నివాళులు



పోతంశెట్టిలో సాయిచంద్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం



సాయిచంద్‌కు నివాళులు అర్పిస్తున్న సమతా సైనిక్ దళ్ బాధ్యుల దృశ్యం

**కొల్చారం, జూన్ 29, ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తన ఆటపాటలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన సాయిచంద్ అకాల మరణం తెలంగాణకు తీరని లోటని బిఆర్‌ఎస్ నాయకులు విచారం వ్యక్తం చేశారు. మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలో గురువారం సాయిచందర్ మరణం పట్ల సంతాప సభ నిర్వహించారు. పోతంశెట్టిపల్లి చౌరస్తాలో మెదక్ హైద్రాబాద్ ప్రధాన రహదారిపై సాయిచంద్ చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా



ఎర్రవల్లిలో మౌనం పాటిస్తున్న నాయకులు

నివాళులు అర్పించారు. సాయిచంద్ గుండెపోటులో అకాల మృతి తెలంగాణకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. సాయిచంద్ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు గడ్డమీది నరసింహులు, సోమ నర్సింలు, చిన్న ఘనపూర్ సొసైటీ వైస్ చైర్మన్ రాజా గౌడ్, యవత నాయకులు ఎర్రోళ్ల ప్రశాంత్, బైకర్ శ్రీకాంత్, విఠల్, అన్వేష్ గౌడ్, మల్లేష్‌గౌడ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

**సాయిచంద్‌కు అకాల మృతి తీరనిలోటు**

**జహీరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** సామాజిక ఉద్యమ గాయకులు, తెలంగాణ ప్రభుత్వ గిడ్డంగుల కార్పోరేషన్ చైర్మన్ సాయి చంద్ అకాల మృతి తెలంగాణకు తీరని లోటని సమతా సైనిక్ దళ్ కమిటి బాధ్యులు విచారం వ్యక్తం చేశారు. సాయిచంద్ గుండెపోటులో అకాల మృతి చెందడంతో అంబేద్కర్ భవన్‌లో సంతాప సభను నిర్వహించి సాయిచంద్ చిత్ర పటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజంలో సమాజికంగా వెనుకబడిన తరగతులను చైతన్యం చేయడానికి తన మదురమైన గొంతును ఉపయోగించారన్నారు. కుల వివక్ష, అంటరాని తనానికి వ్యతిరేకంగా పాటలను ఆలపించి ప్రజలను చైతన్య వంతులను చేసినట్లు గుర్తు చేశారు. మంచి కళాకారుడిని తెలంగాణ కోల్పోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ప్రజా గాయకుడు సాయిచంద్ మృతి తీరనిలోటు**

**మర్కుక్, జూన్ 29 (ప్రభాతవార్త):** ప్రజా గాయకుడు, తెలంగాణ గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మృతి యావత్ తెలంగాణ ప్రజానీకానికే తీరనిలోటు అని సర్పంచ్ భాగ్య బిక్షపతి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో అంబేద్కర్ చౌరస్తాలో సాయిచంద్ మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా గాయకుడు సాయిచంద్ తన మాట, పాటలతో తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ పల్లెలను పాటలతో కదిలించి పాటలను పదునైన ఆయుధంగా మలిచి మలిదశ తెలంగాణ ఉద్యమంలో పల్లెపల్లెలో ప్రతిధ్వనించిన పాటల పోరాట కెరటం అన్నారు. పాట రూపంలో జాతిని జాగృతం చేసే ఆయుధమై ప్రతి గుండెలో మారుమోగాయన్నారు. అంబేద్కర్ బాటలో తన ఆశయ సాధన కోసం పాటలతో ప్రజలను చైతన్యం చేసిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. సాయిచంద్ అకాల మరణం తెలంగాణ సమాజాన్ని కలచివేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, బిఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ కనకయ్య, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**సాయిచంద్ మరణం పట్ల ఎమ్మెల్యే దిగ్భ్రాంతి**

**పటాన్‌చెరువు, జూన్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ ఉద్యమ గాయకుడు సాయిచంద్ అకాల మరణం పట్ల పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తనగాత్రంతో ధూమ్ ధామ్ పాటలతో తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంతో పాటు, గొప్ప నాయకుడిగా ఎదిగే క్రమంలో మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇటీవల పటాన్‌చెరువులో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభలో అంతా తానై తన పాటలతో ప్రజలందరినీ చైతన్యపరచడంతో పాటు పటాన్‌చెరువులో ఏ కార్యక్రమం నిర్వహించిన అన్న నేను వస్తానంటూ ఆప్యాయంగా కార్యక్రమాలకు హాజరయ్యేవాడని గుర్తు చేశారు. ఆయన మరణం వ్యక్తిగతంగా తనకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం గొప్ప కళాకారుని కోల్పోయిందన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



సాయిచంద్‌తో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి (ఫైల్)

## పట్టణంలో మహాజన్ సంపర్క్ అభియాన్

**-బిజెపి పాలనపై ఇంటింట్లో ప్రచారం**

**సదాశివపేట, జూన్ 29, ప్రభాతవార్త:** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తన 9 సంవత్సరాల పాలనలో భారత దేశానికి అందించిన సేవలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులపై భారతీయ జనతా పార్టీ నాయకులు పట్టణంలోని పిఎస్ఎంఎల్ కాలనీలోని ఇంటిట్లో అవగాహన కల్పించారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్ర ఇంచార్జి డి నరసింగరావు ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ అధ్యక్షులు వినీల్, వీరేశం అధ్యక్షతన కాలనీలోని ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రగతి కరపత్రాలను అందించి ఇంటి గోడపై బిజెపి బొమ్మను ముద్రించారు. కార్యక్రమానికి అసెంబ్లి ఇంచార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ దేశ్‌పాండే ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాజేశ్వర్‌దేశ్ పాండే మాట్లాడుతూ రవాణా రంగంలో విప్లవాత్మకంగా అభివృద్ధి చేసే రోడ్ల వ్యవస్థను, రైలు వ్యవస్థను, విమాన రగ వ్యవస్థను అత్యంత వేగంగా విస్తరించారని పేర్కొన్నారు. ప్రపంచంలో భారత దేశం పేరును స్మరించుకునేలా తీర్చి దిద్దిన ఘనత ప్రధాన మంత్రికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి అసెంబ్లి కన్వీనర్ పోచారం రాములు, జిల్లా ఉపాధ్యక్షులు ఓదెల మాణిక్‌రావు, పట్టణ అధ్యక్షులు కే శ్రీనివాస్, పట్టణ నాయకులు శివలింగం, శ్రీశైలం, భవాని ప్రసాద్ యాదవ్, ధార రాజేష్, శివకుమార్, మహేష్ యాదవ్, మండల అధ్యక్షులు అంబదాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంలో మరో మారు బిజెపికే అవకాశం

**-తమిళనాడు బిజెపి నాయకురాలు జయంతి**

**కొల్చారం, జూన్ 29, ప్రభాతవార్త:** కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మరో మారు, తెలంగాణ రాష్ట్రంలో తొలిమారు అధికారంలోకి రావడం తధ్యమని తమిళనాడు రాష్ట్రానికి చెందిన బిజెపి విస్తరక్ నాయకురాలు జయంతి అన్నారు. గురువారం మండలంలోని వరిగుంతం గ్రామంలో బిజెపి నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయి మండల పార్టీ సంస్థాగత విషయాలపై నాయకులతో కలిసి చర్చించారు. కేంద్రం, రాష్ట్రంలో (డబుల్ ఇంజన్ సర్కార్) అధికారంలోకి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి, మండల అధ్యక్షులు పాతూరి దయాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పాల్వంచ రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు జంగంగారి శ్రీకాంత్ గౌడ్, వరిగుంతం బూత్ అధ్యక్షులు క్రిష్ణ గౌడ్, నాయకులు అంజి, క్రాంతి, జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ భాస్కర్, నాయకులు దుర్గా ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంగన్నకు ఘన నివాళులు

**జహీరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** తిరిగిరాని లోకాలకు చేరిపోయిన నియోజకవర్గంలోని మండల కేంద్రమైన ఝరాసంగంకు చెందిన సుంచు సంగన్న ఆత్మకు శాంతి చేకూరాలని అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గురువారం సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సంగన్న చిత్ర పటానికి నివాళులు అర్పించిన సంగన్న చేసిన సామాజిక సేవలను కొనియాడారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులుగా, అంబేద్కర్ వాదిగా, ఉద్దిష్టుగా సమసమాజ నిర్మాణం కోసం భూమి లేని 45 మంది నిరుపేదలకు 90 ఎకరాల భూమిని ప్రభుత్వం పంపిణి చేసేలా చొరవ తీసుకున్న సంగన్న సేవలు చిరస్మరణీయంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ అధ్యక్షులు డి శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్, సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్, సామాజిక వాగ్గేయకారులు రామచందర్ భీంవంశీ, స్టడి సర్కిల్ ప్రధాన కార్యదర్శి ఎన్ రవికాంత్, దళిత నాయకులు పొట్‌పల్లి బాలరాజ్, కర్ణం రవికుమార్, కండెం నర్సింలు, బిచ్చయ్య, ముకుంద్, విఠల్ మాదినం అంజయ్య, జనార్ధన్, గడి అశోక్, సుభాష్, గోపాల్, డి కృష్ణ, బాలయ్య, నర్సింలు, గౌతమ్, అమృత్, పాండు, అశోక్, రవీందర్, రాంచందర్, మచ్చేందర్ పాల్గొన్నారు.

### మహిళలు తమ కలలను సాకారం చేసుకోవాలి

**శామిర్‌పేట జూన్29,ప్రభాతవార్త :** ప్రముఖ బహిష్టు పరిశుభ్రత బ్రాండ్‌లలో ఒకటైన స్టేఫ్రీ హైదరాబాద్‌లోని రిలయన్స్ రిటైల్ స్టోర్‌లో జరిగిన కార్యక్రమంలో తన బ్రాండ్ అంబాసిడర్, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన బ్యాడ్మింటన్ ఛాంపియన్ పి.వి సింధు మరియు ఆమె అభిమానులతో అద్భుతమైన మీట్ అండ్ గ్రీట్‌ను నిర్వహించింది. లక్షలాది మంది యువతులకు రోల్ మోడల్ పి.వి సింధు వినియోగదారులతో కలిసిపోయి మాట్లాడారు...శారీరక మరియు మానసిక శ్రేయస్సు కోసం రాత్రుళ్ల మంచి నిద్ర ఎటువంటి కీలక పాత్రను పోషిస్తుందో అథ్లెట్‌గా ఆమె తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు.

### ఆలయ నిర్మాణానికి బిజెపి నేత విరాళం

**కొల్చారం, జూన్ 29, ప్రభాతవార్త:** మండలంలోని వరిగుంతం గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయ కులు రఘువీరరెడ్డి గురువారం 55వేల 555రూపాయల విరాళాన్ని అంద చేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన రఘువీరారెడ్డికి ఆలయ నిర్మా ణ కమిటి బాధ్యులు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్య క్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పాతురు దయాకర్ గౌడ్, నాయ కులు చౌరిగారి భాస్కర్, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### జూలై15 నుండి వార్షికోత్సవ వేడుకలు

**శామిర్ పేట జూన్29,ప్రభాతవార్త :** అమేజాన్ ఇండియా తమ వార్షిక రెండు రోజుల సంబరం డిస్కవర్ జాయ్‌తో మళ్లీ వచ్చింది. జూలై15 నుండి ఆరంభించి జూలై 16 వరకు కొనసాగే ప్రైమ్ డే ఏడవ ఎడిషన్ రెండు రోజుల గొప్ప డీల్స్, ఆదాలు, బ్లాక్ బస్టర్ వినోదం, కొత్త ఆవిష్కరణలు, ఈ ప్రైమ్ డే నాడు ప్రైమ్ సభ్యులు హాయిగా కూర్చుని, ప్రశాంతంగా అన్ని బ్లాక్ వినోదాన్ని ఆనందించవచ్చు మరియు రెండు రోజుల షాపింగ్ కార్యక్రమంతో తమ సంతృప్తి మేరకు షాపింగ్ చేయవచ్చు అని వెల్లడించింది.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు

### -పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ,రాజకీయ ప్రముఖులు

**నందిగామ జూన్29,ప్రభాతవార్త :**
నందిగామ మండలంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయానికి పైన గురువారం గురు బ్రహ్మ శ్రీశ్రీశ్రీ సతీషన్ నాయర్ సమక్షంలో స్లాబ్ వేశారు.తోలి ఎకాదశి రోజున అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం స్లాబ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.అనంతంర ఆలయ సన్నిధానంలో అన్నదానం నిర్వహించారు.ఈ శుభ కార్యానికి హాజరై పూజల్లో పాల్గొన్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిని ఆలయ కమిటీ సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంకాయల రాంరెడ్డి, బంటారం సుదర్శన్ గౌడ్,దేపల్లే కుమారస్వామి గౌడ్,బి.లక్ష్మయ్య యాదవ్,ఎదిరే శ్రీకాంత్ గౌడ్,సిద్ధాపూర్ శేఖర్ రెడ్డి,చంద్రాపాల్ రెడ్డి, బి.జంగయ్య గౌడ్,మాద్గుల హరీజీవన్,రవిందర్ రెడ్డి,దేపల్లే అశోక్ గౌడ్,గడ్డల యాదగిరి,తుమ్మ నర్సింలు యాదవ్,బాతుక దేవేందర్ యాదవ్,బ్యాంక్ సురేష్,రాఘవేందర్ యాదవ్,పలువురు రాజకీయ ప్రముఖులు,అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## పోచమ్మ గడ్డలో జూలై9న బోనాలు,తొట్టెల ఊరేగింపు



**శంషాబాద్ జూన్29,ప్రభాతవార్త :**
తెలంగాణ సంప్రదాయ ప్రకారం అంగరంగ వైభవంగా జరుపుకునే బోనాల ఉత్సవాలను శంషాబాద్‌లోని పోచమ్మ గడ్డలో జూలై 9వ తేదిన నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది.పోచమ్మ తల్లి ఆలయంలో గురువారం జరిగిన ఉత్సవ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చేవెళ్ల మహేందర్ తెలిపారు. పోచమ్మ మైసమ్మ ఉమ్మడి బోనాలను 9వ తేదిన అందరూ కలిసి నిర్వహించాలని అదే రోజు బోనాలతో పాటు తొట్టెల ఊరేగింపు నిర్వహించనున్నట్లు వివరించారు.బోనాల ఊరేగింపు కోసం భారీ ఎత్తున ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ప్రజలందరూ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కరుణాకటాక్షాలు పొందాలని మహేందర్ సూచించారు.సమావేశంలో చింతల నందకిషోర్ కొప్పుల ప్రశాంత్ కుమార్,సాయిరాం,లింగం సిద్దులు,మహేందర్, శీలం,రవి, వెంకటేష్,రాము,శ్రీకాంత్,నాగేంద్ర,మహేష్,మధు,రమేష్,రాజు,విశ్వనాథ్,రవి,చింటూ వంశి,ధర్మేంద్ర,ప్రవీణ్,అరుణ్, అఖిల్,వరుణ్, చరణ్,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే



బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**షాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :**
రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జీ కంజర్ల ప్రకాష్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని చందన్‌వెళ్లి గ్రామంలో ఇంటింటికి మహాజనసంపర్క్ అభియాన్, గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... బీఆర్ఎస్ ప్రభుత్వ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలే ఆ ప్రభుత్వాన్ని కూలదోస్తాయన్నారు. కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం పారదర్శకంగా ప్రభుత్వాన్ని నడిపిస్తూ, ప్రజాసంక్షేమాన్ని ముందుకు తీసుకువెళ్తుందని తెలిపారు. నేడు ప్రజల్లో బీజేపీపై విశ్వాసం పెరిగిందన్నారు. బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్, నాయకులు రాము, సారా జగన్, నీరటి ఆంజనేయులు, అనంతరం, కావలి వెంకటయ్య, రాంబాబుగౌడ్, కృష్ణయ్యగౌడ్, సింగాపురం రమేష్, కార్యకర్తలు వెంకటయ్య, మల్లేష్, పెంటయ్య, రాంచెంద్రయ్య, చెంద్రయ్య, బిక్షపతి, పుష్పమ్మ, భారతమ్మ తదితరులు ఉన్నారు.

## జూలై 3న చేవెళ్లలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ



దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కురుమ సంఘం నాయకులు

**షాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :**
జూలై 3న చేవెళ్లలో ఆవిష్కరించనున్న దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు కిష్టగొని సదానందం పిలుపునిచ్చారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలో విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్, కరపత్రాలను మండల అధ్యక్షుడు మద్దూర్ పాండు, జిల్లా సహాయ కార్యదర్శి సూద యాదయ్య ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం సంఘం సభ్యులు, నాయకులు, అభిమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..... దొడ్డి కొమురయ్య అడుగుజాడల్లో నడుస్తూ కురుమలు అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. చేవెళ్లలో జూలై 3న దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి కురుమలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో చేవెళ్ల మండల అధ్యక్షులు కసిరె వెంకటేష్, షాబాద్ మండల ఉపాధ్యక్షులు బండ కృష్ణ, చేవెళ్ల మండల ఉపాధ్యక్షులు దండు సతీష్, ప్రధాన కార్యదర్శి కుమార్, సహాయ కార్యదర్శి కుర్వ మల్లేష్, షాబాద్ మండల యూత్ అధ్యక్షులు కూతురు మహేందర్, యూత్ ప్రధాన కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యక్షులు పీరంపల్లి యాదయ్య, కార్యవర్గ సభ్యులు గవ్వల రాజేందర్ కార్యదర్శి సుదర్శన్,నవీన్, కార్యవర్గ సభ్యులు శివ, మహేందర్, శంకర్, నర్సింలు తదితరులు ఉన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన చిన్నతుండ్ల ఎంపిటిసి కుమారుడు

**యాచారం, జూన్ 29 ప్రభాతవార్త**
మండల పరిధిలోని చిన్నతుండ్ల గ్రామానికి చెందిన ఎంపిటిసి మస్కు భారతమ్మ ఈశ్వర్‌ల పెద్ద కుమారుడు ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల గురువారం గ్రామానికి చెందిన భవాని యూత్ అసోఎసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి ఎంతో కష్టపడి చదివి కన్వీనర్ కోటాలో ఎంబిబిఎస్ సీటు సాధించడం ఎంతో గొప్ప విషయమన్నారు.



నందిగామలో సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న బిఆర్ఎస్ నాయకులు



సాయిచంద్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



సాయిచరణ్ పార్థీదేహానికి నివాళులర్పిస్తున్న దేశమల్ల ఆంజనేయులు

# సాయిచంద్‌కు జోహార్లు



వెల్జాల్ గ్రామంలో సాయి చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు సాయిచంద్ అంత్యక్రియల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు, శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, సోషల్ మీడియా అధ్యక్షుడు రఘునందన్ రెడ్డి, నాయకులు నందు తదితరులు.

### నందిగామ మండలంలో..

**నందిగామ జూన్29,ప్రభాతవార్త :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆట,పాటల ద్వారా ఉర్రూతలూగించి తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన ప్రజాగాయకుడు,తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అకాల మృతి పట్ల గురువారం నందిగామ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.సాయిచంద్ అమర్ రహే అంటూ జోహార్లు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సంతాప సమావేశంలో జిల్లా జడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ మేక్కొండ కుమార్ గౌడ్,ప్రముఖ సంఘసేవకుడు తంద్రా గోపాల్ రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి, చేగూరు సింగిల్ విండో చైర్మన్ జి.అశోక్,మాజీ చైర్మన్ ఎం.విఠల్,నాయకులు తుప్పడు నర్సింలు,చించోటి కృష్ణా గౌడ్, శివ్వగల్ల రమేష్,శ్రీనివాస్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

### సాయిచంద్ భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

**ఇబ్రహీంపట్నం, జూన్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ గాయకుడు,రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ అకస్మాతుగా గుండెపోటుతో మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గుర్రంగూడలోని సాయిచంద్ నివాసంలో భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.తెలంగాణ సమాజం గొప్ప గాయకున్ని కోల్పోయిందన్నారు.సాయిచంద్ కుటుంబ సభ్యులను ఓదార్చాడు.ఆయనతో పాటు ఇబ్రహీంపట్నం నాయకులున్నారు.

### కొత్తూర్ పురపాలికలో...

**కొత్తూర్, జూన్ 29, ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమకారుడు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ సాయిచంద్ మరణం చాలా బాధాకరమని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పెంటనోళ్ల యాదగిరి తెలిపారు. కొత్తూర్ పురపాలికలో దేవేందర్‌యాదవ్ సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తూర్ మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తెలంగాణ సామాజికి ముఖ్యంగా బీఆర్ఎస్ రాష్ట్ర సమితి పార్టీకి తన గొంతుక ద్వారా ఎనలేని సేవలు చేసిన సాయిచంద్ మరణం తీరని లోటు అని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ అజయ్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగంనాయక్, ఉపసర్పంచ్ శ్రీరాములుయాదవ్, మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శంకర్‌నాయక్, గోపాల్‌నాయక్, గోపి, ముకిత్, శోకత్, గూడు బాయ్, రంగారెడ్డి, గంటల క్రిష్ణ, జంగయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

### సాయిచంద్‌కు నివాళులర్పించిన ఆంజనేయులు

**షాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మెన్ సాయిచంద్ మృతి రాష్ట్రానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు దేశమల్ల ఆంజనేయులు తెలిపారు. గుండెపోటుతో మృతి చెందిన సాయిచంద్ మృతదేహాన్ని గురువారం ఆయన స్వగ్రామంలో సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమ సమయంలో తాము కలిసి చేసిన ఉద్యమాలను పోరాటాలను ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సాయిచరణ్ చేసిన పాత్ర ఎంతో కీలకమని, చిరస్మరణీయమన్నారు. ఆయన చిన్న వయస్సులో గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నింపి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

### తలకొండపల్లి మండలంలో

**తలకొండపల్లి జూన్29,ప్రభాతవార్త :** గుండె పోటుతో మరణించిన తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయి చంద్ చిత్రపటానికి తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో ప్రజల సమక్షంలో నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్,రైతు సంఘం అధ్యక్షుడు నరేందర్ గౌడ్,గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, జంగయ్య రాజు,యాదయ్య,శ్రీశైలం యాదవ్,అంజి,వెంకటయ్య,రాజు,శేఖర్,శ్రీశైలం,శ్రీనివాస్ గౌడ్,చెన్నకేశవులు, మురళీ,బాలరాజు,సుల్తాన్,సాయి,తదితరులు పాల్గొన్నారు.



జిల్లెడు చౌదరిగూడలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లీం సోదరులు



ఇబ్రహీంను సన్మానిస్తున్న పార్టీ నాయకులు



వెల్జాల్ గ్రామంలో జరిగిన బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

# ఘనంగా బక్రీద్ పండగ

### జిల్లెడు చౌదరిగూడ మండలంలో

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 29,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ముస్లీం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని మజీద్, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మత పెద్దలు అల్లాను వేడుకున్నారు. అనంతరం ఒకరికోకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### షాద్‌నగర్ మండలంలో...

**షాద్‌నగర్, జూన్ 29, (ప్రభాతవార్త) :** బక్రీద్ పండగను త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటామని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, దానధర్మాలు చేయడం ఈ పండగ ముఖ్య ఉద్దేశమని వైఎస్సార్ టీపీ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం అన్నారు. గురువారం బక్రీద్ పండగను పురస్కరించుకొని వైఎస్సార్ టీపీ పార్టీ నాయకులు ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం ఇంటికి వెళ్లి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా శాలువాతో సత్కారించారు. ఈ సందర్భంగా ఎం.డి.ఇబ్రహీం మాట్లాడుతూ... ముస్లీం జరుపుకునే అత్యాంత ప్రముఖ్యత కలిగిన పండగాల్లో ఈ బక్రీద్ ఒకటి అని, ఈ రోజు ఇతరులకు తమ వంతు సహాయంగా ఎదో ఒకటి చేస్తారని అన్నారు. ఇస్లామ్ క్యాలెండర్ ప్రకారం 12వ నెల జిల్‌హెజ్ 10వ తేదిన బక్రీద్ పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఆయన అన్నారు. పండగ సందర్భాంగా పార్టీ నాయకులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, అందరం ఐకమత్యంతో కలిసి మెలిసి ముందుకు సాగాలని ఆయన పార్టీ నాయకులకు సూచించారు. అనంతరం పార్టీ నాయకులు, యువకులు ఇబ్రహీంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈదులపల్లి నర్సింహ్మా, ఆశీర్వాద్, శీలం శ్రీను, రాము, ప్రకాష్‌చారి, సందీప్, డేవిడ్, లింగం, సుధాకర్, రామచంద్రయ్యలు తదితరులు పాల్గొన్నారు.

### తలకొండపల్లి మండలంలో

**తలకొండపల్లి జూన్29,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో ముస్లిం సోదరులకు బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ బక్రీద్ తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...హిందూ ముస్లింలందరూ కలిసిమెలిసి పండుగలు జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు మూజీబుర్ రహేమాన్,ఉప సర్పంచ్ అజీజ్,ఎస్ఎంసి సీతారాం రెడ్డి,ముస్లిం సోదరులు,చిన్నారులు,పాల్గొన్నారు.

## కులాలు, మతాలకు అతీతంగా పండుగలు చేసుకోవాలి

### -ఎమ్మెల్యే కాలే యాదయ్య



తొలి ఏకాదశి సందర్భంగా శంకర్‌పల్లి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**శంకర్‌పల్లి, జూన్ 29 ప్రభాతవార్త:**
కులాలు, మతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. తొలి ఏదాదశి, బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య శంకర్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు అందరికి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ముస్లిం సోదరులను కలిసి ఆయన బక్రీద్ సందర్భంగా కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని వర్గాల వారిని గౌరవిస్తున్నారని అన్నారు. దేవాలయాలతో పాటు మసీదులు, ఈద్గాలను, చర్చిలను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వాసుదేవ్ కన్నా, మున్సిపల్ యూత్ అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి, సయ్యద్ ముంతాజ్, ఎండి జాకీర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిచంద్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు

### -ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

**కొడంగల్,జూన్ 29ప్రభాతవార్త : తెలంగాణా** మలిదశ ఉద్యమకారుడు,ప్రముఖ జానపద గాయకుడు,రాష్ట్ర గిడ్డంగుల సంస్ద చెర్మేన్ సాయిచంద్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.సాయిచంద్ మరణవార్త తెలిసిన వెంటనే కొడంగల్ పర్యటనను రద్దు చేసుకున్న ఎమ్మెల్యే హుటాహుటిన హైద్రాబాద్‌లోని గుర్రంగూడలోని ఆయన నివాసానికి చేరుకొని సాయిచంద్ పార్ధివ దేహానికి నివాళులర్పించారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు తెలంగాణా మలిదశ ఉద్యమంలో తన పాటలతో ప్రజలను చైతన్యం చేయడంతో పాటు బీఆర్ఎస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించారని ఆయన సేవలను కొనియాడారు.ఆయన లేని లోటు పార్టీకి తీరని నష్టమని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా సాయిచంద్ హఠాత్మరణం పట్ల బీఆర్ఎస్ నాయకులు,అంబేద్కర్ యువజన సంఘంతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు కొడంగల్‌లో సంతాపం తెలిపారు.పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సాయిచంద్ చిత్రపటానికి మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్,మాజీ సర్పంచ్ రమేష్‌బాబు,అంబేద్కర్ యువజన సంఘం తాలూకా అద్యక్షులు రమేష్‌బాబు,నాయకులు జగన్,దస్తప్ప తదితరులు పూలమాలలు వేసి నావాళులర్పించారు.



సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## సాయిబాబా ఆలయంలో అన్నదానం



**శంషాబాద్ జూన్29,ప్రభాతవార్త :**
తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శంషాబాద్‌లోని ధర్మగిరి సాయిబాబా ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ధర్మకర్త శివసాయి దత్తు ఆధ్వర్యంలో భక్తులకు భోజన వితరణ గావించారు.వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులకు హారతి అనంతరం అన్నప్రసాదాన్ని అందజేశారు.పవిత్రమైన తొలి ఏకాదశి రోజున భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు శివ సాయి దత్తు తెలిపారు.

## జిల్లాలో ఘనంగా బక్రిద్ పండుగ



**రంగారెడ్డిజిల్లాప్రతినిధి హైదరాబాద్ జూన్ 29(ప్రభాతవార్త) :**
త్యాగానికి ప్రతికగా ప్రతియేటా నిర్వహించే బక్రిద్ పండగను జిల్లాలోని వాడవాడలో భక్తి శ్రద్రలతో జరుపుకున్నారు. రంజాన్ పండగ మాదిరిగానే ఈ బక్రిద్ పండగను కూడా ముస్లింలు ఘనంగా నిర్వహించుకోవడం అనవాయితిగా వస్తుంది.ఈ పండగ సందర్భంగా ముస్లింలు సమాదుల వద్ద ఇష్టమైన దుస్తులు పూలు ఉంచి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.బక్రిద్ పండగను పురస్కరించకోని ముస్లింలు పెద్దమొత్తంలో దేవునికి గొర్రెలను బలిఇచ్చి పేదలకు మాంసము పంపిణిచేశారు.జిల్లా పరిధిలోని ఇబ్రాహీం పట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, షాద్‌నగర్,చేవేళ్ల,ఎల్‌బినగర్, కల్వకూర్తి నియోజకవర్గం పరిధిలోని పలు పట్టణాలు, మున్సిపాల్టీలోని ప్రాంతాలోని గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి ముస్లింలు మజీద్‌లు,ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఇమామ్‌లు బక్రీద్ పండగపై ప్రత్యేక సందేషాలు అందించారు.జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల వద్ద పోలీసులు ముందు జాగ్రత గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడ ఏలాంటి అవాంచనీయ సంఘటనులు జరగకుండా ప్రశాంతగా జరుపుకొన్నారు.

## ఇంటింటికి బిజెపి ప్రచారం



**యాచారం, జూన్ 29 ప్రభాతవార్త**
మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో ఇంటింటికి బిజెపి కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ తొమ్మిది సంవత్సరాల పరిపాలన కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను గురించి కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్యగౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషలు మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలనలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించారు. కిసాన్ సమ్మాన్ నిధి, ఉచిత రేషన్, స్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, నర్సరీలు, కరోనా వ్యాక్సిన్, ఉపాధి హామీ పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజి పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాగని యాదయ్య, గోగికర్ రమేష్, రాయకంటి విజయ్‌కుమార్, పుప్పాల శాంతికుమార్, ఉప సర్పంచ్ పల్లపు నరేష్, పత్తి రాజు, నడికుడి కృష్ణ, ఎలిమినేటి శ్రీనివాస్‌రెడ్డి, సంగెం శ్రీనాథ్, సంతోష్ గుప్తా, గ్రామ బూత్ అధ్యక్షుడు పరమేష్, శ్రీశైలం, గౌర లక్ష్మణ్, భాష, గౌరకుమామార్, వెంకటేష్, శ్రీశైలం, వీరన్న, ఐలయ్య, వినోద్, శ్రీశైలం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నూతన కమిటీల ఎన్నిక

**యాచారం, జూన్ 29 ప్రభాతవార్త**
మండల పరిధిలోని మంథన్‌గౌరెల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, ఎంఎస్ఎఫ్ గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ పోతుగంటి కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఎబిసిడి వర్గీకరణ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము మహేష్, ఉపాధ్యక్షుడు మంద లింగం ఆధ్వర్యంలో మాదిగ జాతిని మేల్కొల్పుతూ ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నూతన కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఎమ్మారీ ్పఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా పోలే రాజు, ఉపాధ్యక్షుడు ఈర్ల వంశీ, ప్రధాన కార్యదర్శి గ్యార శివ, ఎంఎస్ఎఫ్ కమిటీ అధ్యక్షుడు సాయికిరణ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, క్రాంతి కుమార్, ఎమ్మార్పీఎస్ కార్యదర్శి ఆలంపల్లి ప్రవీణ్, సభ్యులుగా ఆకారపు యాదయ్య, విష్ణు, ఈర్ల భాను, శివ, ఈర్ల జంగయ్యలను ఎన్నుకున్నారు.



ఎమ్మార్పిఎస్,ఎంఎస్‌పి,ఎంఎస్ఎఫ్ గ్రామ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారికి నియమాక పత్రం అందజేస్తున్న దృశ్యం

